క్లుప్తంగా

సచివాలయాల సెక్రటరీలు సస్పెన్షన్

నెహ్రూనగర్: ఆస్తి పన్ను వసూలులో వెనుకబాటు, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ముగ్గురు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులను నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం సస్పెండ్ చేశారు. మరో ముగ్గురు అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న 86, 83 వార్డు సచివాలయాల ఇంచార్జి అడ్మిన్ కార్యదర్శి కె.సత్య శ్రావణి, 38, 41 సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులు రాధిక మారాసు, బొడ్డు రజనీని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆకుల శ్రీనివాసరావుకు, 122, 80, 170 వార్డ్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. సదరు కార్యదర్శులు పన్ను వసూలు విధుల్లో లేకపోవడం, జాబ్ చార్ట్ ప్రకారం యూనిఫారం ధరించకుండా ఉంటున్నారని చెప్పారు.

ఆధునిక బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ


గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక బోధనపై సోమవారం గోరంట్లలోని నెక్ట్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూలులో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల గణిత, సైన్సు ఉపాధ్యాయులు హాజరయ్యారు. తరగతి గదిలో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి 35 మంది ఉపాధ్యాయులు హాజరు కాగా, పాఠశాల డైరెక్టర్ కె. శ్రీకాంత్‌బాబు, గుంటూరు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎస్. బుజ్జిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బ్రాడీపేటలోని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి 2008లో మెగా డీఎస్సీ ద్వారా దాదాపు 50వేల పోస్టుల్ని భర్తీ చేసి, వేలాది మంది నిరుద్యోగుల్ని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మార్చారని తెలిపారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చేసిన పాదయాత్రలో భాగంగా ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్, ఎం. కిరణ్‌కబీర్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో నిమ్మ అ'ధర'హో

- ఆశాజనకంగా ధరలు
- వేసవిలో పెరిగిన డిమాండ్
- వర్షాలకు దెబ్బతిన్న తోటలు
- దిగుబడులు పడిపోయినా అధిక ధరలతో రైతుల్లో ఆనందం


మార్కెట్ యార్డులో గ్రేడింగ్ చేసిన నిమ్మకాయలు


మార్కెట్‌లో వేలంపాట నిర్వహిస్తున్న యార్డు అధికారులు

తెనాలి టౌన్: స్థానిక మార్కెట్ యార్డులో ఈ ఏడాది నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వేసవి కావడంతో డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం 50 టిక్కీల కనిష్ఠ ధర రూ.5000, గరిష్ఠ ధర రూ.7600, మోడల్ ధర రూ.6500 వరకు పలుకుతోంది. డిసెంబర్, జనవరి మాసాల్లో అధికంగా కురిసిన మంచుకు పూత పూయడం కూడా ఆగిపోయింది. అడపాదడపా కురిసిన వర్షాలకు తోటలు కూడా దెబ్బతిని, దిగుబడి తగ్గింది. అయినప్పటికీ ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యార్డు పరిధిలో అధికంగా సాగు

తెనాలి మార్కెట్ యార్డు పరిధిలోని దుగ్గిరాల, చుండూరు, వేమూరు తదితర మండలాల్లో సుమారు 1200 నుంచి 1500 ఎకరాల విస్తీర్ణంలో నిమ్మ సాగు జరుగుతోంది. తెనాలి డివిజన్ పరిధిలో సంగం జాగర్లమూడి, అంగలకుదురు, యడ్లపల్లి, వలివేరు, చుండూరు, దుండిపాలెం, మోదుకూరు, యడవూరు, వేమూరు, జంపని, మూల్పూరు, బూతుమల్లి, చిలువూరు, హనుమాన్‌పాలెం, కంఠంరాజుకొండూరు, తుమ్మపూడి, అమృతలూరు, తదితర గ్రామాల పరిధిలో నిమ్మసాగు అధికంగా జరుగుతోంది. దగ్గరలోనే యార్డు ఉండటంతో రైతులు అమ్ముకోవడానికి సులువుగా ఉంది.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

లైసెన్స్ ఉన్న వ్యాపారులు యార్డు వేలం పాటలో నిమ్మ కాయల్ని పాడుకుని గ్రేడింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడి నుంచి లక్నో, వారణాసి, పట్నా, గ్వాలియర్, హౌరా, బెంగుళూరు, చైన్నై, హైదరాబాద్, బీలాస్‌పూర్ లాంటి పట్టణాలకు ఎగుమతి జరుగుతోంది. ఎక్కువగా ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్‌లో గంపలో పోసిన నిమ్మకాయలను కిలో వంతున వేలం వేస్తారు. 50కిలోల టిక్కీ ద్వారా నగదును రైతులకు చెల్లిస్తారు.

మార్కెట్‌లో నిమ్మ ధరల వివరాలు

నెల	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర	మోడల్ ధర
జనవరి	రూ.1800	రూ.2100	రూ.2500
ఫిబ్రవరి	రూ.5000	రూ.7600	రూ.6500

రైతుల్లో ఆనందం

గత మూడేళ్లుగా అరకొరగా ధరలు పలకడంతో రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు. పెట్టుబడి కూడా వచ్చేది కాదు. అయితే, ఈ ఏడాది కురిసిన వర్షాలు ఒక విధంగా రైతులకు నష్టం చేకూర్చినా, మార్కెట్‌లో అధిక ధరలతో కొంత ఒడ్డున పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట

- ఎంఏఎస్‌వీ నాయకుల హర్షం
- యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభిషేక్ తదితరులు

ఏఎన్‌యూ: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించే దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎంఏఎస్‌వీ(మాదిగ అభ్యుదయ సాధన వేదిక) నాయకులు తెలిపారు. ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో తూర్పు గోదావరి జిల్లా నుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొమ్మి ఇజ్రాయెల్‌కు అవకాశంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యత కల్పించడాన్ని హర్షిస్తూ సోమవారం నాగార్జున యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సీఎం చిత్రపటానికి ఎంఏఎస్‌వీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిడతల అభిషేక్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పెద్దపీట వేసిన సీఎం సామాజిక న్యాయ సూత్రాన్ని అంకితభావంతో అమలు చేశారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తూర్పు గోదావరి జిల్లా నుంచి ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా మాదిగల్ని ఎమ్మెల్సీ చేయలేదని, ఆ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. రాజకీయంగా, సామాజికంగా దిగువనున్న వర్గాలకు ప్రోత్సహించడంలో సీఎం ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో బొమ్మి ఇజ్రాయెల్ మాదిగల సమస్యల్ని ప్రత్యేకంగా శాసన మండలిలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీఎంకు ఎంఏఎస్‌వీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బొమ్మి ఇజ్రాయెల్‌ను ప్రోత్సహించిన బాపట్ల ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నందిగం సురేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పి. రోహిణీబాబు, ఎస్. శాస్త్రి, ఎం. చంద్రబాబు, మోహన్, శ్రీను, చొడయ్య, రాజా పాల్గొన్నారు.

జెడ్పీని సందర్శించిన కేంద్ర అధికారుల బృందం

మిషన్ కర్మయోగిలో భాగంగా కార్యక్రమాల పరిశీలన


అధికారుల బృందంతో సమావేశమైన జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈవో మోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: మిషన్ కర్మయోగి కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్ సంస్థల్ని పరిశీలించేందుకు ఎక్స్‌ప్లోజర్ విజిట్స్ కింద కేంద్ర అధికారుల బృందం సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులైన రమిత్ మౌర్య, నిలయ్ కుమార్ సింగ్, సత్యేంద్ర ఝాతో జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈవో జె. మోహనరావు సమావేశమై జెడ్పీ పరిపాలన, సంక్షేమ కార్యక్రమాలను గురించి వివరించారు. జెడ్పీ స్టాండింగ్, జనరల్ బాడీ సమావేశాల నిర్వహణతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలు, టెన్త్ విద్యార్థులకు జెడ్పీ నిధులతో ఉచితంగా పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్, అల్పాహారం గురించి అధికారులకు తెలియజేశారు. 15వ ఆర్థిక సంఘ నిధుల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని వారి దృష్టికి తెచ్చారు. గ్రామ పంచాయతీల ఆర్థిక ప్రణాళికలపై సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలకు శిక్షణ కల్పించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రెనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో శిక్షణ వివరాలను నమోదు చేసిన తీరును పరిశీలించారు. జిల్లాలో అమలు జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జెడ్పీ పరిపాలనపై అధికారులు ప్రశంసలు కురిపించారు. సమావేశంలో డీపీఆర్‌సీ జిల్లా సమన్వయకర్త పీఎస్ పద్మాకర్, ఇన్‌చార్జ్ అకౌంట్స్ అధికారి జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న పాత నేరస్తుడి అరెస్టు

రూ.2.50 లక్షల విలువైన 255 మద్యం సీసాలు స్వాధీనం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మహేష్

నగరంపాలెం: తెలంగాణ మద్యం సీసాల్ని తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్న పాత నేరస్తుడ్ని ఎస్‌ఈబీ గుంటూరు-1, డీఎస్‌ఈఓ బృందం సంయుక్తంగా అరెస్ట్ చేసింది. అతని నుంచి రూ.2.50 లక్షలు ఖరీదు చేసే 255 ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బ్రాడీపేటలోని ఎస్‌ఈబీ గుంటూరు-1 స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఏఎస్పీ డీఎన్.మహేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో ఆదివారం రాత్రి గుంటూరు నగరంలోని అంబేద్కర్‌నగర్ ఆరో వీధిలో అద్దెకు ఉంటున్న కుక్కల మురళీకృష్ణ ఇంట్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వివిధ బ్రాండ్‌ల మద్యం సీసాలు దొరికినట్లు చెప్పారు. వివిధ మార్గాల్లో గుంటూరు తీసుకువచ్చేవాడని విచారణలో వెల్లడైనట్లు ఆయన తెలిపారు. గతంలోనూ రెండుసార్లు ఎస్‌ఈబీ-1 గుంటూరు పోలీసులకు మద్యం సీసాలు విక్రయిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. నేరస్తుడు పశ్చిమ గోదావరి జిల్లా పాదూరు పెదపాలెం గ్రామం నుంచి గుంటూరుకి వలసగా వచ్చి ఆర్టీసీ కాలనీలో తొలుత అద్దెకు ఉండేవాడని తరువాత అంబేద్కర్‌నగర్‌కు మకాన్ని మార్చినట్లు చెప్పారు. లాక్‌డౌన్ నుంచి విక్రయాలు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కేసుని ఛేదించిన ఎస్‌ఈబీ, డీఎస్‌ఈఓ సిబ్బందిని ఏఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ, ఏఎస్ కె.మణికంఠ, ఎస్‌ఈబీ గుంటూరు -1 సీఐ ఎం.రమేష్, డీఎస్‌ఈఓ సీఐ టీపీ నారాయణ స్వామి, ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కృష్ణ మాదిగపై వ్యాఖ్యలు సిగ్గుచేటు

నెహ్రూనగర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై నాయకుడు బ్రహ్మయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు ఖండించారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతగానో పోరాటం చేస్తున్న కృష్ణ మాదిగపై అనుచితంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

పాత గుంటూరు: మార్చి 7న పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అరుణాచలంలోని గిరి ప్రదక్షిణకు గుంటూరు- 2 డిపో నుంచి రెండు స్పెషల్ హైటెక్ బస్సుల్ని ఏర్పాటు చేసినట్లు మేనేజరు షేక్ అబ్దుల్ సలాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులు మార్చి 5న రాత్రి 9:15, 9:30 గంటలకు గుంటూరులో బయలుదేరి కాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించి, మార్చి 6న సాయంత్రం అరుణాచలం చేరుకుంటాయని ఆయన పేర్కొన్నారు. అరుణాచలేశ్వరుని దర్శించుకొని మార్చి 7న సాయంత్రం బయలుదేరి 8న ఉదయం 6:30 గంటలకు తిరిగి గుంటూరు చేరుతాయని వివరించారు. ఒక్కో టికెట్ ధర రూ. 2400 ఉంటుందని తెలిపారు. వివరాలకు 9959225421 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

కళాకారుడు సాంబశివరావుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం రాజనందిని చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం సతీ అనసూయ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు గాదె సాంబశివరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, వేములపల్లి మల్లికార్జునరావు, గాదె శంకరరావు, మందలపు వెంకటేశ్వరరావు, వెంకట శివప్రసాద్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

తెనాలి రూరల్: వచ్చే నెల 18న నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి కోర్టుల ప్రాంగణంలో ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. కుటుంబ కలహాలు, వినియోగదారుల కేసుల్ని పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలి అర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.జశ్వంతరావు తెలిపారు. చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



దుర్గమ్మను వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

తెనాలి టౌన్: పట్టణ బాలాజీరావుపేటలోని అయ్యప్ప ఆలయంలోని అష్టభుజి సన్నిధానంలో తిరునాళ్ల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దర్బా హరిబాబుస్వామి ఆధ్వర్యంలో దుర్గమ్మ అమ్మవారిని సోమవారం పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మార్చి ఐదో తేదీ వరకు నిత్యం కుంకుమ పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఐదు, ఆరు తేదీల్లో పసుపు గౌరి అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని చెప్పారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీకి చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అధికారి లక్ష్మానాయక్

తెనాలి అర్బన్: ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు వారం రోజుల్లో ప్రభుత్వం పౌష్టికాహారాన్ని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటోందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి బి.లక్ష్మానాయక్ పేర్కొన్నారు. తెనాలి జిల్లా వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్, టీబీ యూనిట్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డుల్ని పరిశీలించారు. వ్యాధిగ్రస్తులకు మందుల్ని సకాలంలో సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు, సిబ్బంది, టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు అనుసరణీయం

కర్లపాలెం: వివేకానందుని బోధనలు అనుసరణీయమని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకట సుబ్బారావు తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాగృతి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు జాగృతి పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలలో కర్లపాలెం, చింతాయపాలెం, పెదగొల్లపాలెం, గణపవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి

పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

తెనాలి రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సూచించారు. ముఖ్యమంత్రి సభా కార్యక్రమం నిర్వహించనున్న మార్కెట్ యార్డులో సోమవారం ఆయన పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్యటనలో తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి చర్చించి, పలు సూచనలు చేశారు. హెలీ ప్యాడ్ నుంచి సభావేదిక వరకు వచ్చే మార్గంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, వీఐపీలు వచ్చి వెళ్లే మార్గాలన్నింటిలో ఉదయం ఏడు గంటల్లోగా విధులకు హాజరవ్వాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఆంక్షలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు సభావేదిక, ప్రాంగణాన్ని సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో కలసి పరిశీలించారు.

విజయవంతంగా సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి మార్కెట్ యార్డులో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా విడుదల చేయనున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. హెలీ ప్యాడ్‌ను ఇప్పటికే సిద్ధం చేశారు. సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్‌ను సోమవారం సాయంత్రం నిర్వహించారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకు వాహన రాకపోకల్ని పరిశీలించారు. వచ్చేందుకు, తిరిగి వెళ్లేందుకు పడుతున్న సమయాన్ని నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ట్రయల్ రన్‌ను స్వయంగా పర్యవేక్షించారు.



తలశిల రఘురామ్‌తో కలసి భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



కాన్వాయ్ ట్రాయల్ రన్ నిర్వహిస్తున్న సిబ్బంది

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

తెనాలి రూరల్: ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పట్టణంలో మంగళవారం విధించనున్న ట్రాఫిక్ ఆంక్షలకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ కె.స్రవంతిరాయ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మార్కెడ్ యార్డు వద్ద సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నామన్నారు.

- తెనాలి–నారాకోడూరు మీదుగా వెళ్లే వాహనాలను చెంచుపేట మీదుగా వెళ్లేందుకు అనుమతించబోమని చెప్పారు.
- గుంటూరు వెళ్లాల్సిన వాళ్లు నందివెలుగు–గుంటూరు రహదారిని ఆశ్రయించాలని సూచించారు.
- బాపట్ల నుంచి నారాకోడూరు మీదుగా తెనాలి వచ్చే అన్ని వాహనాలు పొన్నూరు, ఇంటూరు, తురిమెళ్ల, కూచిపూడి మీదుగా తెనాలి రావాల్సి ఉంటుందన్నారు.
- అంగలకుదురు మీదుగా తెనాలి వచ్చే వాహనాలు దుండిపాలెం డొంక మీదుగా పట్టణంలోకి రావచ్చని చెప్పారు. 108 అంబులెన్సులు, ఇతర ఎమర్జెన్సీ సర్వీసుల వాహనాలకు ఎటువంటి ఆంక్షలు ఉండవని స్పష్టం చేశారు.

తపాలా జీవిత బీమాతో కుటుంబాలకు రక్షణ

తెనాలి: తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్‌ను అందించే తపాలా జీవిత బీమా ఎన్నో కుటుంబాలకు రక్షణగా నిలుస్తోందని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.రమేష్ పేర్కొన్నారు. పాలసీలు పరిపక్వత (మెచ్యూరిటీ) తర్వాత అధిక రాబడిని నెలనెలా వివిధ అవసరాలకు అందిస్తోందని చెప్పారు. తెనాలి పోస్టల్ డివిజన్ పరిధిలో 2015 మార్చిలో తపాలా జీవిత బీమా పాలసీ తీసుకున్న పోలీస్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్, 2022 అక్టోబరులో మృతి చెందారు. బీమా క్లెయిం సొమ్ము రూ.16.62 లక్షలను సోమవారం అనిల్‌కుమార్ భార్య డి.నాగపావనికి సూపరింటెండెంట్ కె.రమేష్ అంజేశారు. స్థానిక ప్రధాన పోస్టాఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం తపాల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రొఫెషనల్ ఉద్యోగులు, ఇతర అర్హత కలిగిన ప్రజలకు తపాలా జీవిత బీమా (పీఎల్ఐ)ను 140 ఏళ్లుగా అందిస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాధాకృష్ణమూర్తి, హెడ్ పోస్టుమాస్టర్ ఎం.తిరుపతమ్మ, పీఎల్ఐ సీపీసీ ఇన్‌చార్జి ఎస్‌వీపీ సోమశేఖర్ పాల్గొన్నారు. పోస్టల్ అధికారులకు నాగపావని, కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.



నాగపావనికి క్లెయిం మొత్తం అందజేస్తున్న రమేష్

భార్యపై భర్త దాడి

తెనాలి రూరల్: భార్యపై భర్త దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరు చెందిన వివాహిత రాణి సోమవారం చినరావూరు పార్కుకు వాకింగ్ కోసం వెళ్లింది. కొద్దిసేపటికి అక్కడికి వెళ్లిన భర్త ఆమెపై దాడి చేశాడు. అనుమానంతో తనను అనుసరించి వచ్చి దాడి చేశాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తైక్వాండో పోటీల్లో వెస్ట్ బెర్రి స్కూలు విద్యార్థుల ప్రతిభ




తెనాలి టౌన్: రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 26న నిర్వహించిన 20వ డిస్ట్రిక్ తైక్వాండో చాంపియన్‌షిప్ సబ్ జూనియర్స్ ఈ–కాడెట్ బాలబాలికల విభాగంలో వెస్ట్ బెర్రి స్కూలు విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కొడాలి శేషులత తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు కె.హేమచరణ్, కె.ప్రవీణ్, వై.కార్తీక్, ఎం.తమోఙ్ఞ, వి.చంద్రశేఖర్, కె.హనీష్‌ను సోమవారం స్కూలులో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. మార్చిలో యలమంచిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరంతా అర్హత సాధించినట్లు కోచ్ కె.ప్రసాద్‌బాబు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆజాద్‌కు ఘన నివాళి

బాపట్ల అర్బన్: భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో సాయుధ పోరాట బాట పట్టిన వారిలో అగ్రగణ్యుడు చంద్రశేఖర్ ఆజాద్ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు కొనియాడారు. ఆజాద్ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్లేయులపై ప్రతీకారం తీర్చుకొని భారతీయుల సత్తా చాటారన్నారు. బ్రిటిష్ పోలీసులు చుట్టుముట్టగా తనను తాను కాల్చుకొని అమరడయ్యాడైన మహా త్యాగి అన్నారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, న్యాయవాదులు జంరుద్ బాషా, భాస్కరరావు పాల్గొన్నారు.

● ఫొటోగ్రాఫర్‌కు ఏఎన్‌పీఎస్ గౌరవం



ఫొటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజుకు నికోసియా ఫొటోగ్రాఫిక్ సొసైటీ(ఏఎన్‌పీఎస్) ఆనర్ లభించింది. 2022 డిసెంబర్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల ఫలితాలను ఇటీవల ప్రకటించారు. కలర్ విభాగంలో పంపిన ఫొటోలకు గౌరవం దక్కింది. దీంతో సొసైటీ చైర్‌పర్సన్ బి.ఒజాటై అభినందనలు తెలిపారు. – బాపట్ల అర్బన్

సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం కావాలి

భట్టిప్రోలు: విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నందున సిలబస్ పూర్తి చేయాలని ఎంఈఓ పులి లాజర్ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లాజర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు విజిట్‌కు వచ్చినప్పుడు సంబంధిత ప్రొఫార్మాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పంపిన మూడు వీడియోలను అందరూ హెచ్‌ఎంలు చూసి వాటిని పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేసేలా చూడాలన్నారు. సమావేశంలో భట్టిప్రోలు, ఐలవరం, వెల్లటూరు, పెసర్లంక ప్రధానోపాధ్యాయులు సి.రామకోటేశ్వరరావు, కె.లక్ష్మీనారాయణ, కె.నిరీక్షణరావు, ఎస్‌కే మహబూబ్ బాషా పాల్గొన్నారు.

భట్టిప్రోలులో విగ్రహాల ఏర్పాటుకు పోటా పోటీ

- అనుమతి ఇవ్వలేదంటున్న ఆర్ అండ్ బీ శాఖ
- ఆ శాఖ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- ఆ ప్రాంతంలో పోలీస్ బందోబస్తు



విగ్రహాల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్న వారితో చర్చిస్తున్న ఎస్ఐ సురేష్

భట్టిప్రోలు: భట్టిప్రోలులో విగ్రహాల ఏర్పాటుకు ఆయా వర్గాలు పోటీపడుతున్నాయి. వివరాలు.. స్థానిక బౌద్ధ స్తూపం ఎదురుగా ఈ నెల 22వ తేదీన వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో విగ్రహాల ఏర్పాటుకు గ్రామ సర్పంచి దారా రవికిరణ్మయి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బండారు కుమారి భూమి పూజ చేశారు. ప్రస్తుతం పిల్లర్లు ఏర్పాటు చేసేందుకు పనులు సాగుతున్నాయి. ఈ స్థలంలో స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటుకు కొందరు ఆదివారం రాత్రి పనుల్ని ప్రారంభించారు. అదే స్థలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని మరికొందరు ప్రయత్నిస్తున్నారు. అందు కోసం ఆ స్థలాన్ని చదును చేయించారు. అయితే, ఈ స్థలంలో పదేళ్ల క్రితమే అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటుకు ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని కొందరు చెబుతున్నారు. మొదట భూమి పూజ నిర్వహించిన విగ్రహాల నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానం చేసినప్పటికీ, ఆ స్థలం ఆర్ అండ్ బీకి చెందినది కావడంతో ముందుగా ఆ శాఖ అనుమతులు పొందాల్సి ఉంది. తమ శాఖ ఏ అనుమతి ఇవ్వలేదని ఏఈ మైనేని కృష్ణారావు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఒకరికి ఒకరు పోటీ పడి విగ్రహాలు ఏర్పాటు చేయడంపై సోమవారం ఏఈ కృష్ణారావు ఫిర్యాదు చేయడంతో భట్టిప్రోలు ఎస్ఐ వై.సురేష్ విగ్రహాల ఏర్పాటుకు చేపడుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ అనుమతులు తీసుకున్న తరువాతే నిర్మాణ పనులు చేపట్టాలని నిర్వాహకుల్ని హెచ్చరించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే బైండవర్ చేస్తామని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈఓపీఆర్డీ శేఖర్ ఏమన్నారంటే..

విగ్రహాల ఏర్పాటుకు పంచాయతీ అనుమతి తీసుకున్నా ఆ స్థలం ఎవరి పరిధిలోకి వస్తుందో ఆ శాఖ అనుమతి తీసుకోవాలి. నిర్మాణం చేసేటప్పుడు ముఖ్యంగా జిల్లాస్థాయిలోని హైపవర్ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

రైతు సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా



బహిరంగ సభా వేదిక వద్ద క్రిస్టీనా తదితరులు

తెనాలి: రైతుసంక్షేమం కోరేదే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టీనా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ నిమిత్తం మంగళవారం తెనాలి రానున్న నేపథ్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన సభా వేదికను సోమవారం ఆమెను సందర్శించారు. రైతుల కోసం వ్యవసాయ పరికరాలతో ఏర్పాటు చేస్తున్న స్టాల్స్, సభావేదిక ముందున్న గ్యాలరీ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారితో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కష్టపడి పని చేస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏటా రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్‌తో రూ.13,500 పంపిణీ జరుగుతోందని గుర్తు శారు. ఈ ఏడాది కూడా వీటితో పాటు ఇటీవల పంట నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీకి డెల్టాకు ప్రాధాన్యతనిస్తూ సీఎం తెనాలికి రావటం రైతులపై ఆయనకు గల చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆమె వెంట జిల్లా పరిషత్ సీఈవో మోహనరావు, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎల్.విజయలక్ష్మణ్, తహసీల్దార్ కె.రవిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరిగ చంద్రారెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి ఉన్నారు.

జిల్లా వైద్యశాలను సందర్శించిన ఢిల్లీ బృందం

తెనాలి అర్బన్: స్థానిక జిల్లా వైద్యశాలను ఢిల్లీకి చెందిన నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాడెడ్స్ కమిటీ సభ్యులు డాక్టర్ అనూప్ కో, డాక్టర్ రాజారామ్ యాదవ్, డాక్టర్ జ్యోతి ఉల్‌హాస్ లంద్ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలోని ఓపీ, వార్డులు, థియేటర్లు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూప్ కో మాట్లాడుతూ తెనాలి జిల్లా వైద్యశాలలో నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్‌ను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఇక్కడే ఉండి రోగులకు అందుతున్న వైద్య సేవలతో పాటు అన్ని విభాగాల్ని క్షుణ్ణంగా పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ తెనాలి జిల్లా వైద్యశాలకు ఎన్ క్వాస్ సర్టిఫికెట్ లభిస్తే అదనంగా నిధులు వచ్చే అవకాశం ఉందని, వాటి ద్వారా ఆసుపత్రిలోని అనేక వసతుల కల్పన చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.హనుమంతరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీసీహెచ్ఎస్ డాక్టర్ హనుమంతరావుతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

రైతు పక్షపాతి సీఎం జగన్

తెనాలి టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా పరిపాలన చేస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అవుత సీత తెలిపారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి ప్రారంభించేందుకు తెనాలి రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆశయాల్ని ఎమ్మెల్యే శివకుమార్ నెరవేరుస్తున్నారని తెలిపారు. ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా తెనాలి గడ్డపై అడుగు పెడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు. ఆయన రాకతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి పరిపాలన చేస్తున్నారని పేర్కొన్నారు. ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతులకు సేవలందిస్తున్నారని చెప్పారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వంపుగళ్ల కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి తెనాలి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఆయన రైతులకు అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలేదా నసీమా, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతి, కొల్లిపర జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు భట్టిప్రోలు వెంకటలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సీత, ప్రజా ప్రతినిధులు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 16మంది ఎంపిక

తెనాలి అర్బన్: హైదరాబాద్‌కు చెందిన మైండ్ వేవ్ ఇన్ఫర్మ్యాటిక్స్ సంస్థ మంగళవారం జేఎంజే కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించింది. సంస్థ ప్రతినిధులు గ్రూపు డిస్కషన్, ఇంటర్వ్యూలను నిర్వహించి 16మందిని ఎంపిక చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ, ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థుల్ని కళాశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకరయ్య, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ థెరిస్సామ్మ, ప్రిన్సిపాల్ షైనీ

తైక్వాండో పోటీల్లో పలువురుకి పతకాలు

తెనాలి అర్బన్: 20వ జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలిలోని సీఎంసీ ఫిట్‌నెస్ జోన్‌కు చెందిన ఆరుగురు క్రీడాకారులకు బంగారు పతకాలు, నలుగురికి వెండి పతకాలు లభించినట్లు కోచ్ కొక్కిలిగడ్డ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. రేపల్లెలో ఆదివారం పోటీల్ని నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారుల్ని తెనాలిలో సోమవారం అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చందూస్ జిమ్ మేనేజింగ్ డైరెక్టర్ చందు వెంకటేశ్వరరావు, డాక్టర్ కోటి నాగయ్య పాల్గొన్నారు.



పతకాలు అందుకున్న విద్యార్థులతో కోచ్ ప్రసాద్ బాబు, వెంకటేశ్వరరావు తదితరులు

పరీక్ష కేంద్రం కొనసాగించాలి

బాపట్ల అర్బన్: వేమూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు పాత ఎగ్జామ్ సెంటర్‌నే కొనసాగించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు సోమవారం బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ఏప్రిల్ 3న జరుగనున్న టెన్త్ పరీక్షలకు పరీక్ష కేంద్రాన్ని తీసివేసి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జంపని జిల్లా పరిషత్ హైస్కూలులో ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. జిల్లా విద్యా అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేమూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పరీక్ష సెంటర్‌ను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్య, రాజేష్, శ్రీను, మోహన్ చంద్ర పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

విదేశాలలో ఉన్నత విద్యావకాశాలపై అవగాహన ఉండాలి

డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు

బాపట్ల: విదేశాలలో ఉన్నత విద్యావకాశాలపై అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నతోద్యోగాలు పొందాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ కళాశాలలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత విద్య లక్ష్యంతో చదువును కొనసాగించాలని, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఉన్న అవకాశాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న కళాశాల 1969 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ప్రొఫెసర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఏఎల్ఎన్ రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అమెరికాలోని విశ్వ విద్యాలయాలలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ విద్యలో ప్రవేశాలు పొందే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో పూర్వ ఎంటమాలజి విభాగాధిపతి డాక్టర్ జి.రాఘవయ్య, అహ్మద్ పాల్గొన్నారు.





జనహృదయ నేతకు
స్వాగతం.. సుస్వాగతం...
సంక్షేమ సారథి, అభివృద్ధి ప్రధాత,
రైతన్నల శ్రేయస్సే శ్వాసగా పరిపాలన కొనసాగిస్తూ...
రైతన్నలకు వై.యస్.ఆర్. రైతు భరోసా, పి.యం. కిసాన్,
ఇన్ పుట్ సబ్సిడిని అందించడం కోసం
నేడు తెనాలి విచ్చేయుచున్న
మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గారికి
మా హృదయపూర్వక స్వాగత
సుమాంజలులు
అన్నాబత్తుని శివకుమార్
శాసనసభ్యులు, తెనాలి
మరియు తెనాలి నియోజకవర్గ ప్రజలు